ప్రతిభావంతుల వెన్నంటే అవకాశాలు



కామర్స్ ఫెస్ట్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయన్న

కాచిగూడ: ప్రతిభగల విద్యార్థులకు అవకాశాలు వెన్నంటే ఉంటాయని కాకతీయ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.సాయన్న అన్నారు. పారిశ్రామీకరణతో కామర్స్ విద్యార్థులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోందని చెప్పారు. బర్కత్‌పురలోని అవంతి డిగ్రీ అండ్ పీజీ కాలేజీలో శనివారం జనకృత్ –2024 పేరుతో రెండు రోజుల మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ ఫెస్ట్ నిర్వహించారు. విద్యార్థులకు సింగింగ్, డ్యాన్సింగ్, స్టేజీ ప్లే, కరోకే, మెహిందీ తదితర పోటీలను ఈ సందర్భంగా నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలను, సర్టిఫికెట్స్‌ను అందజేశారు. అనంతరం సాయన్న మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి అవసరమయ్యే స్కిల్స్‌ను విద్యార్థులు ఎప్పటికప్పుడు నేర్చుకోవాలని, పుస్తకాల్లోని విషయాలనే కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా నేర్చుకోవాలని సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ వీర సోమయ్య, కామర్స్ హెచ్‌ఓడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

దేశ సంపదను తాకట్టు పెడుతున్న మోదీ


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు

ముషీరాబాద్: షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా పీవైఎల్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యానగర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి రాంనగర్ చౌరస్తాలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పీవైఎల్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.ప్రదీప్, పి.రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమర యోధుల త్యాగాలను విస్మరిస్తూ నేటి పాలకులు దేశాన్ని తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం దేశసంపదను లూటీ చేస్తూ కొందరు బడా పారిశ్రామికవేత్తలకు తాకట్టు పెడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు, పీడీఎస్‌యూ, పీవైఎల్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనిల్, ప్రవీణ్, రవికుమార్, భూషణవేణీకృష్ణ, నాయకులు సుమంత్, రాకేష్, భాను, కావ్య, అఖిల, కిరణ్, శ్రీనివాస్, భూమేష్, మల్లేష్, బాలు, ప్రకాష్, మనోహర్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి: ముత్తినేని


సమావేశంలో మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దివ్యాంగుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో మహిళా వికలాంగుల సాధికారత అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు తీసుకుంటామని చెప్పారు. ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వికలాంగుల సమస్యలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఎన్‌పీఆర్‌డీ కార్యదర్శి అడివయ్య, పి.జెనీలా, సుబ్రహ్మణ్యం, టి.జ్యోతి, అరుణజ్యోతి, కె.వెంకట్, సాయమ్మ, ఆర్.వెంకటేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌ను సందర్శించిన డీసీపీ


చిక్కడపల్లి పోలీసులతో సమావేశమైన డీసీపీ ఆక్షాన్ష్ యాదవ్, సీఐ సీతయ్య, ఎస్‌ఐలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ ఆక్షాన్ష్‌యాదవ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా డీసీపీకి ఇన్‌స్పెక్టర్ సీతయ్య స్వాగతం పలికారు. అనంతరం నూతన పోలీసుస్టేషన్ నిర్మాణ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను డీసీపీ అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో వివిధ విభాగాలను సందర్శించి రికార్డులను పరిశీలించి కేసుల పురోగతిపై ఆరా తీశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతాచర్యలు, అదనపు బలగాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీసీపీతో జరిగిన సమావేశంలో స్థానిక ఎస్‌ఐలు నాగరాజు, శివపాల్‌రెడ్డి, మౌనిక పాల్గొన్నారు. అంతకుముందు స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అన్ని సమయాలలో అందుబాటులో ఉండాలన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులవి అసమాన త్యాగాలు


భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు

కవాడిగూడ: భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వంటి స్వాతంత్య్ర సమరయోధులు అసమాన త్యాగాలతో స్వాతంత్య్రం తీసుకువస్తే, నేటి బీజేపీ పాలకులు దేశంలో అంతులేని దోపిడీ చేస్తున్నారని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి సందర్భంగా శనివారం దోమలగూడ ఏవీ కాలేజీ వద్ద భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమ్ ఆద్మీపార్టీ నేతలు నివాళులర్పించారు. సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ బీజేపీ ముందు తలవంచడానికి సిద్ధంగా లేని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ లాంటి నేతలను ఈడీ, సీబీఐలతో వేధిస్తూ బూటకపు కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీపార్టీ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, ఎంఏ మజీద్, ఆమ్ ఆద్మీ పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి, అధికార ప్రతినిధులు అక్షయ్, జావిద్, షరీఫ్, దివ్యాంగ కమిటీ చైర్మన్, దర్శనం రమేష్ నేతలు కె.శ్రీనివాస్, మౌనిక, రాకేష్‌రెడ్డి, అనూజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిర్ణయం హర్షణీయం


సమావేశంలో మాట్లాడుతున్న త్యాగరాజు, రంగయ్య

కాచిగూడ: పర్యావరణ పరిరక్షణ దృష్టితో పార్లమెంట్ ఎన్నికల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని భారత ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలను ఆదేశించడం అభినందనీయమని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య, జాతీయ కన్వీనర్ ముదిగొండ త్యాగరాజు అన్నారు. శనివారం నారాయణగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు పర్యావరణ హితకరంగా జరిగేలా ఈసీ పార్టీలు, నాయకులకు సూచించడం ప్రకృతి మనుగడకు కొత్త ఊపిరి పోసినట్లయిందన్నారు. ఎన్నికల ప్రచారంలో బైక్ ర్యాలీలు, పెద్ద స్థాయి శబ్దాలు, సాధారణ జనజీవనానికి ఇబ్బంది కలిగించే సభలు, ర్యాలీలు నిషేధించాలని కోరారు. మరిన్ని పర్యావరణ హిత చర్యలకు ఈసీ చొరవ తీసుకోవాలని, ఇదే విషయాన్ని ఈసీకి పోస్టు ద్వారా ఉత్తరం రాయనున్నామని వారు పేర్కొన్నారు.

ఒకేవిధంగా వేతనాలివ్వాలి


శ్యామ్‌సుందర్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నారాయణ తదితరులు

చిక్కడపల్లి: జలమండలిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ జీవో 60 కేటగిరి–2 ఒకే విధంగా వేతనాలు ఇవ్వాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌బీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నగర సంయుక్త కార్మిక కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు పి.నారాయణ మాట్లాడుతూ హెచ్‌ఎండబ్ల్యూఎస్‌బీలో వాటర్ సప్లయ్, ఇతర విభాగాల్లోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భిన్నవేతనాలు ఇస్తున్నారని తెలిపారు. ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా ఓటీ విధానాన్ని అమలు చేయాలని కోరారు. అందరికీ ప్రతి ఈ నెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, కార్మికులందరికీ రూ.20 లక్షల ప్రమాద బీమా కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, కుమార్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలి: సాగర్


భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు సిద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ టి.సాగర్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు తీరని మోసం చేస్తోందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అన్నారు. ప్రతిపక్ష నాయకులు, ముఖ్యమంత్రులను అవినీతి నెపంతో అరెస్టులు చేయిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పశ్య పద్మ, మండల వెంకన్న, ఐలయ్య, బాలమల్లేష్, శోభన్‌నాయక్, అరిబండ ప్రసాదరావు, సుజాత, టి.స్కైల్యాబ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అసమానతలులేని సమాజం కోసం ఉద్యమించాలి

భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో అసమానతలు లేని సమాజం కోసం ఉద్యమించాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ పిలుపునిచ్చారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతిని పురస్కరించుకొని ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ హైదరాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సుందరయ్య పార్కు నుంచి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడినవారి ఆలోచనలకు విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం మతరాజకీయాలకు శ్రీకారం చుట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి, లెనిన్, డీవైఎఫ్‌ఐ నాయకులు జావిద్, శ్రీనివాస్, నాగేందర్, ప్రశాంత్, చరణశ్రీ, సహనా, విజయ్‌కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ త్యాగం స్ఫూర్తిదాయం

అంబర్‌పేట్: బీజేపీ డివిజన్ కార్యదర్శి రోహిత్ రాజ్ ఆధ్వర్యంలో శనివారం అంబర్‌పేట మహంకాళి ఆలయం వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు ఎస్.గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణాయాదవ్ మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు చిన్న వయస్సులో దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భారతమాత ముద్దుబిడ్డలని, వారు నేటి తరానికి స్ఫూర్తిప్రదాతలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు చుక్క జగన్, కౌన్సిల్ మెంబర్ దత్తు ముదిరాజ్, కోడూరు సురేష్, ఏడెల్లి భాస్కర్, అసెంబ్లీ కో కన్వీనర్ అచ్చిని మహేష్, కృష్ణగౌడ్ గోవర్ధన్‌రెడ్డి, రంగంపల్లి రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు సునంద, కార్యదర్శి కవిత, నాయకులు సుజాత, సరళ, శారద, కనకలక్ష్మి, ముఖేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ సందేశ్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

26న పద్మశాలి సంఘం సమావేశం

కాచిగూడ: తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ప్రథమ రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం ఈ నెల 26న నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి తెలిపారు. ఈ సమావేశానికి అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో పద్మశాలి సంఘాన్ని మరింత పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కులగణన ప్రక్రియను వేగవంతం చేయండి

బుర్ర వెంకటేశంను కోరిన కుమారస్వామి

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలుకు ముందే జీఓ 26 ద్వారా ప్రభుత్వం కులగణన చేపడుతున్నట్లు ప్రకటించినందున ఆ ప్రక్రియను వేగవంతం చేయాలని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంను బీసీ దళ్ ప్రతినిధులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ బలహీన వర్గాలు దశాబ్దాలుగా అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం తమ వాటా ఇవ్వాలని కోరుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక కులగణనకు ముందుకు రావడం శుభ పరిణామమన్నారు. బుర్ర వెంకటేశం మాట్లాడుతూ జీవో 26 విడుదల చేసినందున సర్వేపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో బీసీ దళ్ నేతలు డాక్టర్ మహేంద్ర బాబు, శ్రీనివాస్ సుందర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత సునీల్‌దాస్ మృతి


సునీల్‌దాస్(ఫైల్)

ముషీరాబాద్: ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు, ముషీరాబాద్ గౌరీశంకర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సునీల్ దాస్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్లవెల్లి అంజిరెడ్డి, ముషీరాబాద్ నియోజకవర్గం బి–బ్లాక్ కమిటీ కన్వీనర్ రామకృష్ణ ముదిరాజ్, గ్రేటర్ ఉపాధ్యక్షులు లింగం గుప్తా, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలు ముషీరాబాద్ హిందూశ్మశాన వాటికలో నిర్వహించారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


శ్రీరామ్‌నగర్ బస్తీలో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ రవిచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచి నీటి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని కార్పొరేటర్ రవిచారి అన్నారు. శనివారం శ్రీరామ్ నగర్ బస్తీ, కమాన్ బస్తీలో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రైనేజీ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు హరినాథ్, రవి, కిరణ్, రాములు, శ్రీహరి, ఉపేందర్, శ్రీను, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటి

ముషీరాబాద్: బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు సకాలంలో వైద్య సేవలు పొందేవిధంగా యూపీహెచ్‌సీ వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి అన్నారు. శనివారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో ఎన్‌సీడీ, ఆయుష్మాన్ భారత్ పథకాల అమలుపై వైద్య సిబ్బంది, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అక్షితరెడ్డి, డాక్టర్ సునందా, వైద్యాధికారి డాక్టర్ దీప్తిప్రియాంక, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన బద్రుకా 'సత్రంగ్ –2024'



బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ధరంపాల్ సింగ్ మల్హోత్రా

కాచిగూడ: కాచిగూడలోని బద్రుకా కామర్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన 'సత్రంగ్ – 2024'ముగింపు వేడుకల్లో విద్యార్థులు ప్రతిభాపాటవాలను ప్రదర్శించి శభాష్ అనిపించుకున్నారు. ఆట పాటలతో అలరించారు. స్వర్ణోత్సవ్ (సంగీతం), అనుకృతి (ఫ్యాషన్ షో), రంగమంచ్ (డ్రామా, మైమ్, మిమిక్రీ), రంగమంచ్ (లఘు చిత్రం), రంగోలి, పెయింటింగ్, పాట్ పెయింటింగ్, వెజిటబుల్, వస్త్ర ప్రదర్శన, కుచ్ తుమ్ కహో కుచ్ హమ్, సర్పం యొక్క నడక తదితర అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ప్రతిభను చాటారు. బద్రుకాన్‌లు ఫ్లాష్ మాబ్ ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా 'శ్రీరంగనీతులు'చిత్ర బృందం చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ శ్రీకృష్ణ బద్రుకా, ఎస్.అభిరామ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ కుమార్, ధరంపాల్ సింగ్ మల్హోత్రా, డాక్టర్ వెంకటయ్య, డాక్టర్ జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి


ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన వేణుగోపాల్

కాచిగూడ: పౌష్టికాహారం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆర్టీసీ బర్కత్‌పుర డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ అన్నారు. శనివారం బర్కత్‌పురలో తెలంగాణ యువతి మండలి, ఎ.శ్యామలదేవి మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌లో ఆయన మాట్లాడారు. విద్యతోపాటు ఆహారంతో కలిగే లాభాలు, మరికొన్ని పదార్థాలతో కలిగే నష్టాలను విద్యార్థులకు ప్రదర్శనలు, ప్రయోగాల ద్వారా వివరిస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. ప్రతి విద్యార్థి అన్ని రకాల పోషకాహారం తీసుకోవాలన్నారు. విద్యార్థులు తమకు వచ్చిన వంటలను చేసి తీసుకురావడం ఫుడ్ ఫెస్టివల్ ప్రత్యేకతని వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్యకుమారి, లెక్చరర్లు దీప్తి, దీప, శిరీష తదితరులు పాల్గొన్నారు.

రజాకార్ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలి


రజాకార్ సినిమాను తిలకిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

ముషీరాబాద్: రజాకార్ సినిమాను ప్రతి ఒక్కరూ చూడాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచించారు. రజాకార్ల ఆగడాలను ఈ సినిమా కళ్లకట్టినట్లు చూపించిందని పేర్కొన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని సంధ్య థియేటర్‌లో నడుస్తున్న రజాకార్ సినిమా ఫస్ట్ షోను మంత్రి కిషన్‌రెడ్డి శనివారం తిలకించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ప్రేమ్‌సింగ్‌రాథోడ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు శ్యామ్‌సుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీ, ముషీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, రాష్ట్ర నాయకులు పూసరాజు, అజయ్‌కుమార్, గౌరీశంకర్, సదానంద ముదిరాజ్, మహేందర్, గడ్డం నవీన్, బిజ్జి కనకేష్ తదితరులున్నారు.

ఆరోగ్య సంరక్షణలో నిర్లక్ష్యం తగదు


వైద్యపరీక్షలు చేస్తున్న మెడికోవర్ హాస్పిటల్ వైద్య సిబ్బంది

కాచిగూడ: ప్రజలు ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని శ్రీ హనుమాన్ దేవాలయం కార్యదర్శి నాగేంద్ర అన్నారు. మెడికోవర్ హాస్పిటల్ బేగంపేట బ్రాంచి ఆధ్వర్యంలో శనివారం హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యం, అవగాహనలోపం కారణంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు హాస్పిటల్ బ్రాంచి హెడ్ రాజ్‌కుమార్, మేనేజర్ వినోద్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయం చీఫ్ అడ్వయిజర్ సాయిరాం ప్రసాద్, సునిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహశాస్త్రి గొప్ప సాహితీవేత్త



చిక్కడపల్లి: నోరి నర్సింహశాస్త్రి గొప్ప సాహితీవేత్త రిటైర్డ్ డీజీపీ అరవిందరావు అన్నారు. నోరి రచనలు వైవిధ్యభరితమైనవని పేర్కొన్నారు. నర్సింహశాస్త్రి 125వ జయంతిత్సోత్సవం, ట్రస్టు రజతోత్సవాలు శనివారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాంటెక్‌లోని కాళిదాస్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య పెన్నా మధుసూదన్‌కి నోరి పురస్కారం, అవధాన విద్యాకోకిల బులుసు అపర్ణకు నోరి యువరచయిత ప్రోత్సాహక పురస్కారాన్ని అరవిందరావు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య ముదిగొండ శివప్రసాద్, వారణాసి వేంకటేశ్వర్లు, ఎస్వీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ముదిగొండ అమరనాథశర్మ, నోరి శివసేనాని, కళ్యాణసుందరం, నోరి సుబ్రహ్మణ్యశాస్త్రి, గౌరీశంకర్, వేపా సూర్యనారాణయశాస్త్రి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయండి


మున్షీని కలిసిన కృష్ణగౌడ్

అంబర్‌పేట్: బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడేది కాంగ్రెస్ పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ అన్నారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన టీఆర్‌ఎస్ నాయకులు కె.కృష్ణగౌడ్ పార్టీలో చేరిన సందర్భంగా ఆ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆమెను కలిశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, నగర సీనియర్ నాయకులు కరిగెంటి రమేశ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నేత నాగభూషణం


సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాగభూషణం

ముషీరాబాద్: భోలక్‌పూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర కనీస వేతనాల బోర్డు మాజీ వైస్ చైర్మన్ జి.నాగభూషణం శనివారం ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగభూషణం మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

యువతకు భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు

ముషీరాబాద్: భగత్‌సింగ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని హిందూవాహిని నగర కార్యదర్శి విశ్వేశ్వర్(బబ్లూ) అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ హిందూవాహిని ఆధ్వర్యంలో భోలక్‌పూర్ హౌస్ వద్ద గల భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని నాయకులు శివ, మణికంఠ, రాఘవేందర్, విశాల్, నీరజ్, మురళీ దదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

చిక్కడపలి: ఆరు దశాబ్దాలపాటు ఒక సంస్థ నిరాటంకంగా కొనసాగడం గొప్ప విషయమని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. అశోక్‌నగర్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ 60వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండురోజుల సంబరాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు బి.రామమూర్తి, కార్యదర్శి బి.సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి జి.పద్మావతి, నాగలక్ష్మి, కృష్ణవేణి, సుభాషినిసింగ్, జ్యోత్స్నతో పాటు డాక్టర్ ఏవీ మనోహరరావు, డాక్టర్ రత్నశ్రీ, ఉమాలక్ష్మణ్‌లు పాల్గొన్నారు. పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.